సాక్షి నల్లగొండ

సోమవారం । 3 । ఫిబ్రవరి । 2025



తెలంగాణకు అన్యాయం..
బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధుల కేటాయింపులో మోదీ ప్రభుత్వం వివక్ష చూపిందని ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. - 8లో



బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు
చెరువుగట్టు శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభంకానున్నాయి. - 8లో



నకిలీ విలేకరుల అరెస్ట్
అధికారులను బెదిరించి డబ్బు వసూళ్లకు పాల్పడుతున్న నకిలీ విలేకరులను పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో

న్యూస్‌రీల్

ప్రజావాణి రద్దు

నల్లగొండ : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రజావాణి కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించి నల్లగొండ కలెక్టరేట్‌కు రావొద్దని సూచించారు.

కబడ్డీ జట్టు ఎంపిక

నాగార్జునసాగర్ : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనే నల్లగొండ జిల్లా సీనియర్ కబడ్డీ పురుషుల జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఆర్.భూలోకరావు, కర్తయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జట్టు ఫిబ్రవరి 4 నుంచి 7వ తేదీ వరకు ఆదిలాబాద్‌లో జరిగే తెలంగాణ సీనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. కె.కోటేష్ కెప్టెన్‌గా సాయికిరణ్, లక్ష్మణ్, రాజశేఖర్, లోకేష్, కళాచారి, భరత్, అశోక్, ఉదయ్, వేణు, వినయ్‌కుమార్, శరత్, ఉదయరాజుతో జట్టును ఎంపిక చేసినట్లు వెల్లడించారు.

బీజేపీ మంత్రులు, ఎంపీలు రాజీనామా చేయాలి



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

నాగార్జునసాగర్ : కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రకటించిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి గుండుసున్నా దక్కిందని, ఇందుకు నైతిక బాధ్యత వహిస్తూ బీజేపీ మంత్రులు, రాష్ట్ర ఎంపీలు రాజీనామా చేయాలని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నాగార్జునసాగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు లాభం చేకూర్చేలా ఉందన్నారు. రాష్ట్ర విభజన చట్టానికి తూట్లు పొడుస్తూ బడ్జెట్ రూపొందించారని మండిపడ్డారు. తెలంగాణ నుంచి బీజేపీకి 8 మంది ఎంపీలు, ఇద్దరు మంత్రులున్నా చేసిందేమీ లేదన్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, సీహెచ్ లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

క్రీడా సాంస్కృతిక ఉత్సవాలు వాయిదా

మోత్కూరు : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో మోత్కూరులో ఈ నెల 8, 9, 10 తేదీల్లో జరగాల్సిన రాష్ట్రస్థాయి క్రీడా సాంస్కృతికోత్సవాలు వాయిదా వేసినట్లు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మోత్కూరు ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలన్న ఉద్దేశంతో రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలు నిర్వహించతలపెట్టినట్లు పేర్కొన్నారు. ఎన్నికల కోడ్‌ను అందరూ గౌరవించాలని, తదుపరి తేదీలను కోడ్ ముగిసిన తరువాత ప్రకటిస్తామన్నారు.

విద్యారంగాన్ని విస్మరించారు

నల్లగొండ టూటౌన్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగాన్ని విస్మరించారని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ అన్నారు. ఆదివారం ఎంజీ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన యూనివర్సిటీ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చే నిధులు అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది వేతనాలకే సరిపోతాయని అన్నారు. ఈ సమావేశంలో యూనివర్సిటీ కో కన్వీనర్ పవన్, ఎం. వెంకటేశం, శ్రీను, మహేష్ పాల్గొన్నారు.

అధ్యాపకులకు వేతనాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న అసోసియేషన్ నాయకులు

నల్లగొండ: అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యాపకులకు నాలుగు సంవత్సరాలుగా జీతాలు రావడం లేదని తెలంగాణ లెక్చరర్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు పెరిక మధు తెలిపారు. ఆదివారం నల్లగొండలో లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లెక్చరర్లకు జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నామని, ప్రభుత్వం స్పందించి వెంటనే తమకు జీతాలు చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో యూనివర్సిటీ కౌన్సిలర్ జగదీష్, శంకర్, సుధాకర్, పున్నం అంజయ్య, హరిత, కిశోర్, లింగస్వామి పాల్గొన్నారు.



భక్తుల కోలాటం, విద్యుద్దీపాలంకరణ నడుమ సాగుతున్న స్వామి, అమ్మవార్ల ఊరేగింపు



నల్లగొండ రామగిరి రామాలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వీరేశం, మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

రమణీయం.. నగరోత్సవం

రామగిరి(నల్లగొండ) : నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు జడల పార్వతీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి నల్లగొండలో నగరోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రత్యేక పూజలు చేసి నగరోత్సవాన్ని ప్రారంభించారు. విద్యుద్దీపాలంకరణ, పాటలు, మహిళల కోలాటాల నడుమ నగరోత్సవం వైభవంగా కొనసాగింది. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పథకాలకు కోడ్ అడ్డంకి!

- రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల మంజూరుపై స్పష్టత కరువు
- అర్హుల ఎంపిక పూర్తయినా.. తప్పని ఎదురుచూపులు
- పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన గ్రామాల్లోనే మంజూరు పత్రాల అందజేత
- ఎన్నికల కోడ్ ముగిశాకే మిగతా గ్రామాల్లో అమలు చేస్తారని ప్రచారం



నల్లగొండ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులకు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారుతోంది. ఈ నాలుగు పథకాలను ప్రభుత్వం జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రారంభించింది. మొదట ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని ఆ గ్రామం ఈ నాలుగు పథకాలను పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు మంజూరు చేసింది. ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో ఈ పథకాల అమలుపై స్పష్టత కరువైంది. ఎన్నికలు పూర్తయి కోడ్ ముగిసిన తర్వాతే ఈ పథకాలను మిగతా గ్రామాల్లో అమలు చేస్తారని ప్రచారం సాగుతోంది.

గ్రామసభల్లో అర్హుల జాబితాలకు ఆమోదం

ఎన్నికల హామీల అమలులో భాగంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల మంజూరుకు సన్నద్ధమైంది. అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. రైతు భరోసాకు 5.42 లక్షలు, రేషన్‌కార్డులకు 27,523, ఇందిరమ్మ ఇళ్లకు 4.31, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం 2,76,118 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు దారుల్లో అర్హుల ఎంపిక కోసం గ్రామాలు, పట్టణాల్లో సర్వే నిర్వహించారు. అర్హుల జాబితాలను గ్రామ, వార్డు సభల్లో ఉంచి ఆమోదం తీసుకున్నారు. అప్పట్లో దరఖాస్తు చేసుకోలేని వారి నుంచి కూడా దరఖాస్తులు తీసుకోగా.. రైతు భరోసాకు 31,536, రేషన్ కార్డులకు 4,976, ఇందిరమ్మ ఇళ్లకు 4,677, ఆత్మీయ భరోసాకు 713 మంది దరఖాస్తు చేసుకున్నారు.

మండలానికి ఒక గ్రామంలోనే అమలు..

ఈ నాలుగు పథకాలను ముందుగా ప్రతి మండలంలో ఒక గ్రామానికి పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని గణతంత్ర దినోత్సవం సందర్భంగా అమలు చేశారు. జిల్లాలోని 31 మండలాల్లో 31 గ్రామాలను ఎంపిక చేసి జనవరి 26న లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించారు. రైతు భరోసా సాయాన్ని బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు.

మిగతా గ్రామాల పరిస్థితి ఏమిటి..?

ఇప్పటి వరకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన గ్రామాల్లోనే పథకాలను అమలు చేసిన ప్రభుత్వం మిగతా గ్రామాల్లో అమలు విషయంపై స్పష్టత ఇవ్వలేదు. అర్హులందరికీ ఒకేసారి ఇస్తారా..? లేక విడతల వారీగా ఇస్తారా అనేదానిపై కూడా ఎలాంటి ప్రకటనా చేయలేదు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మొదటి విడతలో ఇస్తామని చెప్పారు. మిగతా గ్రామాల్లో ఎవరికి ఎప్పుడిస్తారు.. ఎవరికి ఇస్తారు.. ఏ పద్ధతిలో ఎంపిక చేస్తారు అనే విషయంపై అర్హులు అయోమయంలో ఉన్నారు.

ప్రజల్లో అనుమానాలు

వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ బుధవారం అమల్లోకి వచ్చింది. ఎన్నికల కోడ్‌కు ముందే పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాల్లో పథకాలు ప్రారంభించారు. ఎన్నికల కోడ్ ఉన్నందున కొత్తగా ఎలాంటి పథకాలను ప్రారంభించవద్దనే నిబంధన ఉంది. అంతకుముందే ప్రారంభించిన పథకాలను అమలు చేస్తారని.. ఎన్నికల కోడ్ మార్చి 8వ తేదీన ముగుస్తుందని.. ఆ తర్వాతే అమలు చేస్తారనే చర్చ సాగుతోంది. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన వస్తేనే పథకాల అమలుపై ప్రజలను అనుమానాలు నివృత్తి అవుతాయి.

ఎమ్మెల్సీ ఎన్నికకు నేడు నోటిఫికేషన్

- నేటి నుంచి 10వ తేదీ వరకు వరంగల్ – ఖమ్మం – నల్లగొండ టీచర్ ఎమ్మెల్సీ నామినేషన్ల స్వీకరణ
- నల్లగొండలోని కలెక్టరేట్‌లో ఏర్పాట్లు పూర్తి



కలెక్టరేట్ ఎదుట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సోమవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఉదయం 11 గంటల నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్లను నల్లగొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ కార్యాలయంలో స్వీకరించనున్నారు. ఇందు కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

కలెక్టరేట్ వద్ద బారి కేడ్లు

ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 11న నామినేషన్ల పరిశీలన, 13న సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. ఆ తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలు ప్రకటిస్తారు. 27 పోలింగ్, మార్చి 3వ తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుంది. నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి ఇప్పటికే కలెక్టరేట్ బయట 100 మీటర్ల పరిధిలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. 100 మీటర్లలోపు మూడు వాహనాలు, నామినేషన్ వేసే అభ్యర్థితో కలిపి ఐదుగురిని మాత్రమే అనుమతిస్తారు.

హెల్ప్ డెస్క్ ఏర్పాటు..

నామినేషన్లు సమర్పించేందుకు వచ్చే అభ్యర్థుల సందేహాలను నివృతి చేసేందుకుగాను హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. నామినేషన్లు నింపడంలో ఎలాంటి సందేహాలున్నా అక్కడి సిబ్బంది ద్వారా నివృత్తి చేసుకోవచ్చు. నామినేషన్లు నింపుకుని వచ్చిన అభ్యర్థులు నిబంధనలకు అనుగుణంగా అన్నీ ఉన్నాయా.. ఇంకా ఏవైనా పూర్తి చేయాలా.. ఏవైనా సర్టిఫికెట్లు జత చేయాలా తదితర వివరాలను తెలుసుకునేందుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. నామినేషన్ సమర్పించేందుకు ఎక్కువ మంది ఒకేసారి వస్తే ఇబ్బంది కలుగకుండా వెయిటింగ్ హాల్ కూడా సిద్ధం చేశారు.

నిబంధనలు ఇలా..

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నామినేషన్లు సమర్పించే వారు జనరల్ అభ్యర్థి అయితే రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీలైతే రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలి.
- ఎమ్మెల్సీకి పోటీ చేసే వ్యక్తి తెలంగాణ రాష్ట్రంలో జనరల్ ఓటరై ఉండాలి. రాష్ట్రంలోని ఏ జిల్లాల్లో కూడా ఓటు హక్కు లేకపోతే పోటీకి అనర్హుడు.
- నామినేషన్ సమర్పించే అభ్యర్థికి పది మంది ప్రపోజల్స్ సంతకాలు చేయాల్సి ఉంటుంది. వారంతా వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఈ మూడు జిల్లాల పరిధిలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరై ఉండాలి.

ప్రయోగ పరీక్షలకు వేళాయే..

- నేటి నుంచి ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్
- జిల్లావ్యాప్తంగా 44 సెంటర్లు ఏర్పాటు
- హాజరుకానున్న 8,349 మంది విద్యార్థులు
- సీసీ కెమెరాల నిఘాలో కొనసాగనున్న పరీక్షలు



నల్లగొండ : ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు(ప్రాక్టికల్స్) సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం ఇంటర్ బోర్డు అధికారులు అన్నిఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండు సెషన్లుగా జరగనున్న ఈ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఈ సారి ప్రత్యేకంగా ఒక్కో కళాశాలకు రెండు సీసీ కెమెరాలు అమర్చారు.

105 పరీక్ష కేంద్రాలు..

జిల్లాలో మొత్తం ప్రభుత్వ, ప్రైవేట్, కస్తూరిబా, మోడల్ స్కూళ్లతో పాటు గురుకుల జూనియర్ కళాశాలలు 132 ఉన్నాయి. ఇందులో మొదటి సంవత్సరం విద్యార్థులు 16400 మంది ఉండగా, రెండో సంవత్సరం విద్యార్థులు 15,600 మంది, ఒకేషనల్‌లో 5,019 మంది ఉన్నారు. ఇంటర్ ప్రాక్టికల్స్ కోసం మొత్తం 105 కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 83 కేంద్రాల్లో జనరల్ విద్యార్థులకు, 22 కేంద్రాల్లో ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ జరగనున్నాయి.

మూడు విడతలుగా పరీక్షలు

సోమవారం నుంచి 22వ తేదీ వరకు జరగనున్న ప్రాక్టికల్స్ మొత్తం మూడు విడతలుగా జరగనున్నాయి. మొదటి విడతలో ఈనెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు, రెండో విడత 8వ తేదీ నుంచి 12 వరకు, మూడో విడత 13వ తేదీ నుంచి 22వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. మొదటి విడత ప్రాక్టికల్స్ కోసం మొత్తం 45 కేంద్రాలను కేటాయించగా.. 33 కేంద్రాల్లో జనరల్, 12 కేంద్రాల్లో ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ జరగనున్నాయి.

25 మంది విద్యార్థులకు ఒక ఎగ్జామినర్

ప్రాక్టికల్స్ పర్యవేక్షణకు 25 మంది విద్యార్థులకు ఒక ఎగ్జామినర్‌ను నియమించారు. ఇప్పటికే అధ్యాపకులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రశ్నపత్రాలను అరగంట ముందుగా ఇంటర్ బోర్డు ఆన్‌లైన్‌లో ఉంచనుంది. అనంతరం సంబంధిత కేంద్రాల ఇన్‌చార్జుల ఫోన్‌కు వచ్చే ఓటీపీ ద్వారా ప్రశ్నపత్రాన్ని ఎంపిక చేస్తారు. మూల్యాంకనం ఆన్‌లైన్‌లో చేపట్టనున్నారు. పరీక్షల పర్యవేక్షణకు ప్రతి సెంటర్‌కో సీఎస్‌ను నియమించారు.

యాదగిరి క్షేత్రంలో నిత్యారాధనలు



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో ఆదివారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు.. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు చేసి, తులసీదళ అర్చనతో కొలిచారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. అలాగే ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించి, సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవను ఆలయంలో ఊరేగించారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

గట్టుమీద దిష్టిపూజ

- కేసారం నుంచి పెద్దగట్టుకు చేరిన దేవరపెట్టె
- భారీగా తరలివచ్చిన భక్తులు
- పోలీసుల భారీ బందోబస్త్

చివ్వెంల, సూర్యాపేట టౌన్: రాష్ట్రంలోనే రెండవ అతిపెద్దదైన చివ్వెంల మండలం దురాజ్‌పల్లిలోని శ్రీలింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతర దిష్టిపూజ మహోత్సవం ఆదివారం అర్ధరాత్రి అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఫిబ్రవరి 16 నుంచి 20 వరకు జరుగనున్న జాతరకు పదిహేను రోజుల ముందు మాఘ మాసంలో అమావాస్య ఆదివారం దిష్టిపూజ నిర్వహించడం ఆనవాయితీ. దీంట్లో భాగంగా శనివారం మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం చీకటాయపాలెం నుంచి మహాయాత్రగా సూర్యాపేట మండలం కేసారం గ్రామానికి తీసుకొచ్చిన దేవరపెట్టెకు ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన మెంతబోయిన, మున్న, గోర్ల, బైకాను వంశస్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీలింగమంతులస్వామి, గంగమ్మ, ఆకుమంచమ్మ, యలమంచమ్మ, చౌడమ్మలతో ఉన్న దేవరపెట్టెతో పాటు బియ్యం, పాలు, పెరుగు, నెయ్యి, కుంకుమ, కొబ్బరికాయలు, నిమ్మకాయలు, గుగ్గిలం, మైసాచి, తల్లి, పిల్ల గొర్రెను ఊరేగింపుగా పెద్దగట్టుకు తీసుకొచ్చారు. గ్రామం నుంచి తొమ్మిది కిలోమీటర్ల దూరంలో ఉన్న పెద్దగట్టుకు అర్ధరాత్రి వందలాది మంది భక్తులు ఓ లింగా.. నామస్మరణతో తరలి రావడంతో గొల్లగట్టు మార్మోగింది. ఈ సందర్భంగా డప్పు, భేరీల శబ్దంతో గజ్జెల లాగుల సవ్వడితో పడమర వైపు ఉన్న మెట్లపై నుంచి గట్టుపైకి దేవరపెట్టెను చేర్చి ఆలయం చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణలు చేశారు. దిష్టిపూజకు అవసరమైన రెండు బోనాలను మున్న, మెంతబోయిన వారు తీసుకొచ్చి శ్రీలింగమంతుల స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం బైకాను కథకుడి ఆధ్వర్యంలో దేవరపెట్టె ముందు చంద్రపట్నం (పసుపు ముగ్గు) వేశారు. ముగ్గుపై బియ్యంతో ఐదు చిన్నచిన్న రాశులు పోసి వాటిపై కుడుకలు, నిమ్మకాయలు, పోకలు ఉంచారు. ముగ్గుకు రెండు వైపులా నూనెతో దీపాలు వెలిగించారు. లింగమంతులస్వామి దిష్టి కుంభంపై ఉన్న అన్నం ముద్దను మున్నవారికి, చౌడమ్మతల్లి దిష్టికుంభంపై ఉన్న అన్నం ముద్దను మెంతబోయిన వారికి ప్రసాదంగా అందించి దిష్టిపూజను ముగించారు.



భేరీ మోగిస్తున్న భక్తుడు



కేసారం గ్రామంలో నిర్వహించిన దేవరపెట్టె ఊరేగింపులో పాల్గొన్న యాదవులు, గ్రామస్తులు

భారీ పోలీస్ బందోబస్తు

దూరజ్‌పల్లిలోని పెద్దగట్టులో దిష్టిపూజ కార్యక్రమం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ పర్యవేక్షణలో సూర్యాపేట పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఒక డీఎస్పీ తోపాటు ఇద్దరు సీఐలు, 11 మంది ఎస్ఐలు, 100 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్త్ ఏర్పాటు చేశారు



పెద్ద గట్టుపైన నైవేద్యం వండుతున్న భక్తులు

ఆలయం చుట్టూ బలిహరణ

చివరగా తల్లి, పిల్ల గొర్రెలను అమ్మవారికి బలిచ్చి రక్తం నైవేద్యంలో కలిపి ఆలయం చుట్టూ బలిహరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పోలెబోయిన నర్సయ్య యాదవ్, డైరెక్టర్లు పోలెబోయిన నరేష్ యాదవ్, కుర్ర సైదులు, మెంతబోయిన లింగయ్య, మెంతబోయిన చిన్న మల్లయ్య, వీరబోయిన సైదులు, సిరపంగి సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.



కేసారం నుంచి దేవరపెట్టెను తరలిస్తున్న యాదవులు

క్లుప్తంగా

నీటి తొట్టిలో పడి చిన్నారి మృతి


నవనీత మృతదేహం

పాలకవీడు: ప్రమాదవశాత్తు నీటి తొట్టిలో పడి చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన పాలకవీడు మండలంలోని హనుమయ్యగూడెం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాణావత్ కృష్ణ, శిరీష దంపతులకు ఏడాదిన్నర పాప నవనీత ఉంది. కృష్ణ సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. వారం రోజుల క్రితం శిరీష, కుమార్తె స్వగ్రామం వచ్చారు. తల్లి ఇంటి పనులు చేస్తుండగా.. పాప ఆడుకుంటూ ఇంటి ముందున్న నీటి తొట్టిలో పడిపోయింది. కొద్దిసేపటికి గమనించిన తల్లి పాపను బయటకు తీసి బోరున విలపించింది. చుట్టుపక్కల వారు గమనించి అంబులెన్స్‌లో మిర్యాలగూడెం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే నవనీత మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు.

ఉండ్రుగొండలో అఘోరీ ప్రత్యక్షం

- సెల్ఫీ అడిగిన యువకుడితో ఘర్షణ


యువకుడితో గొడవ పడుతున్న అఘోరీ

చివ్వెంల(సూర్యాపేట): చివ్వెంల మండల పరిధిలోని ఉండ్రుగొండ గ్రామంలో అఘోరీ హల్‌చల్ చేసింది. శనివారం రాత్రి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మంగళగిరి నుంచి వేములవాడకు వెళ్తూ మార్గమధ్యంలో ఉండ్రుగొండ గ్రామ శివారులోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ ఆర్చి వద్ద భోజనం చేసేందుకు ఆగింది. పలువురు ఆమెను ఫొటోలు తీస్తుండటంతో తనను ఎందుకు ఫొటోలు తీస్తున్నారని వారిపై దాడికి ప్రయత్నించింది. దీంతో వారు ఆమెను కొట్టారు. ఆమె తన కారులో ఉన్న తల్వార్ తీసి గొడవ చేసింది. గ్రామస్తులు సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని ఆమెకు నచ్చజెప్పి గ్రామం నుంచి తీసుకువచ్చారు. రాత్రి ఖాసింపేట గ్రామ శివారులో తన కారులోనే నిద్రించింది. ఆదివారం తెల్లవారుజామున టిఫిన్ చేయడానికి వెళ్లడంతో ఓ యువకుడు ఆమెను సెల్ఫీ అడగడంతో అతడిపై దాడికి దిగింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ మహేశ్వర్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని ఆమెను అక్కడి నుంచి పంపించారు.

బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు

- చెర్వుగట్టులో భక్తుల కోసం ఆరోగ్య కేంద్రాలు, విచారణ కేంద్రాలు
- అందుబాటులో రెండు అంబులెన్స్‌లు
- ప్రత్యేక బస్సు సర్వీసు కేటాయించిన ఆర్టీసీ అధికారులు



నార్కట్‌పల్లి: మండలంలోని చెర్వుగట్టు గ్రామంలో గల శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. 9వ తేదీ వరకు కొనసాగనున్న ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అధికారి నవీన్‌కుమార్ వెల్లడించారు. ప్రత్యేక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు నార్కట్‌పల్లి, అక్కెనపల్లి డాక్టర్లు విజయ్‌కుమార్, వరూధిని తెలిపారు. గట్టు పైన నార్కట్‌పల్లి పీహెచ్‌సీకి చెందిన 20 మంది సిబ్బంది, గట్టు కింద అక్కెనపల్లి పీహెచ్‌సీకి చెందిన 20 మంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. అదేవిధంగా రెండు అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఇక పార్కింగ్ కోసం నార్కట్‌పల్లి నుంచి వచ్చే వాహనాలకు చెర్వుగట్టు గ్రామ శివారులో, ఎల్లారెడ్డిగూడెం నుంచి వచ్చే వారికి దారిలో, ఏపీ లింగోటం నుంచి వచ్చే వారికి గ్రామ శివారులో ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు కొనసాగిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ డిపో నుంచి ప్రతి 5 నిమిషాలకు ఒక బస్సు చొప్పున నడుపుతున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్, భువనగిరి నుంచి నల్లగొండకు వచ్చే ప్రతి ఆర్డినరీ సర్వీసు చెర్వుగట్టు మీదుగా వెళ్లనున్నట్లు తెలిపారు. జిల్లా పరిధిలోని వివిధ డిపోలకు చెందిన ఎక్స్‌ప్రెస్ సర్వీసులు కూడా ఎల్లారెడ్డిగూడెంలో ఆగే విధంగా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విచారణ కేంద్రాల ఏర్పాటు

గట్టుపైన, కింద విచారణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు ఎలాంటి తినే ఆహార పదార్థాలు ఇచ్చినా తీసుకోవద్దని సూచించారు. భక్తులు కోనేరు వద్ద స్నానం ఆచరిస్తున్న సమయంలో, స్వామివారికి మొక్కులు సమర్పించే సమయంలో వారి వస్తువులను వారే భద్రపర్చుకోవాలని తెలిపారు.

భక్తులకు ఇబ్బందులు కలగనీయం

బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశామని ఎంపీడీఓ కతురోజు ఉమేష్ తెలిపారు. 8 ప్రదేశాల్లో భక్తులకు నీటి వసతి, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ప్రత్యేకంగా చెత్త కుండీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రెండు షిఫ్టుల్లో ఇద్దరు డీఎల్‌పీఓలు, ఆరుగురు ఎంపీడీఓలు, తొమ్మిది మంది ఎంపీఓలు, 90 మంది గ్రామ పంచాయతీ కార్యదర్శులు, 75 మంది గ్రామ పంచాయతీ సిబ్బంది, 400 మంది ప్రైవేట్ సిబ్బంది బ్రహ్మోత్సవాల విధులు నిర్వహిస్తారని తెలిపారు.

900 మంది సిబ్బందితో భద్రత

- ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ : చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐదుగురు డీఎస్పీలు, 25 మంది సీఐలు, 93 మంది ఎస్‌ఐలు, 186 మంది మహిళా సిబ్బందితో కలిపి మొత్తం 900 మంది సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. వాహనదారులు వారికి కేటాయించిన ప్రదేశాల్లో పార్కింగ్ చేసుకోవాలని కోరారు. దొంగతనాలు జరగకుండా నివారించేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని, గుట్ట పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్‌కి అనుసంధానం చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. భక్తులకు ఏమైనా ఇబ్బందులు ఎదురైనా పోలీస్ కంట్రోల్ రూం, డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

పెద్దకాపర్తి అబ్బాయి.. మాంచెస్టర్ అమ్మాయి


వివాహ బంధంతో ఒక్కటైన రాజీవ్‌రెడ్డి, లారెన్ ఫిషర్

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి గ్రామానికి చెందిన రామన్నపేట సమితి మాజీ ప్రెసిడెంట్ కందిమళ్ల జగ్గారెడ్డి మనుమడు రాజీవ్‌రెడ్డికి యూకేలోని మాంచెస్టర్‌కు చెందిన యువతితో శనివారం వివాహం జరిగింది. రాజీవ్‌రెడ్డి మాంచెస్టర్‌లో హోటల్ మేనేజమెంట్ కోర్సు పూర్తి చేసి అక్కడే ఉద్యోగం చేస్తున్నాడు. అక్కడే పోలీస్‌శాఖలో పనిచేస్తున్న లారెన్ ఫిషర్‌తో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. ఇద్దరూ వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. హైదరాబాద్‌లో ఇరు కుటుంబాల పెద్దల సమక్షంలో హిందూ సంప్రదాయ పద్ధతిలో శనివారం మూడు ముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. తమ కుమార్తె తెలంగాణ ఇంటి కోడలు కావటం ఎంతో ఆనందంగా ఉందని వధువు తల్లిదండ్రులు కే.ఫిషర్ డేవ్ ఫిషర్ ఆనందం వ్యక్తం చేశారు. పెళ్లి కుమారుడి తల్లిదండ్రులు మహేందర్‌రెడ్డి-ప్రేమలత ఇరుకుటుంబాలకు చెందిన పెద్దలతో పాటు పెద్దకాపర్తి గ్రామ మాజీ సర్పంచ్ కందిమళ్ల శిశుపాల్‌రెడ్డి-రేణుక, కందిమళ్ల జైపాల్‌రెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించారు.

దుకాణంలోకి దూసుకెళ్లిన కారు



సంస్థాన్ నారాయణపురం: మండల కేంద్రంలోని గంటిల రంగయ్యకు చెందిన జనరల్ స్టోర్స్‌లోకి ఆదివారం రాత్రి ఓ కారు అదుపుతప్పి దూసుకెళ్లింది. దీంతో షాపు వద్ద ఉన్న యాదయ్య, భిక్షపతికి గాయాలయ్యాయి. కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో భయపడిన డ్రైవర్, కారును రోడ్డు వైపు మళ్లించే క్రమంలో అదుపు తప్పి దుకాణంలోకి దూసుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ ఉద్యోగులకు గాయాలు


వాహనంలో ఇరుక్కుపోయిన డ్రైవర్

కట్టంగూర్: మండలంలోని అయిటిపాముల గ్రామ శివారులో హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ఆర్టీసీ ఉద్యోగులకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్టీసీ ఉద్యోగులైన గరిణేపల్లి నర్సింహారావు, వడ్డెబోయిన వెంకటేశ్వర్లు డ్రైవర్ ఉపేందర్‌రెడ్డితో కలిసి డ్యూటీలో భాగంగా సూర్యాపేట నుంచి నల్లగొండకు ప్రభుత్వ బొలెరో వాహనంలో బయలుదేరారు. మార్గమధ్యంలోని అయిటిపాముల గ్రామ శివారులో గల శ్రీరాఘవేంద్ర ఫెర్రో అల్లాయిస్ కంపెనీ వద్దకు రాగానే ముందు వెళుతున్న కంటైనర్ లారీ డ్రైవర్ సుజిత్ కుమార్ సడన్ బ్రేక్ వేయడంతో వెనకాల వస్తున్న ప్రభుత్వ బొలేరో వాహనం అదుపుతప్పి కంటైనర్‌ను ఢీకొట్టింది. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న గూడ్స్ బొలేరో వాహనం ఆర్టీసీ ప్రభుత్వ వాహనాన్ని వెనక నుంచి ఢీకొట్టడంతో ప్రభుత్వ వాహనం నుజ్జునుజ్జయింది. అందులో ఉన్న ముగ్గురు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. బొలేరోలోని క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను పోలీసులు, స్థానికులు బయటకు తీశారు. ప్రమాదానికి గురైన వాహనాలు రోడ్డు పై ఉండటంతో హైవే సుమారు 2 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. తీవ్ర గాయాలైన క్షతగాత్రులను పోలీసులు నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మిర్యాలగూడెం ఆర్టీసీ డిపోకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి తుక్కాని శేఖర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవీందర్ తెలిపారు.

బైక్ చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

నాగారం: బైక్ చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ ఐలయ్య తెలిపారు. ఆదివారం నాగారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. మండల కేంద్రంలో గత సంవత్సరం నవంబర్‌లో గ్రామానికి చెందిన ఓర్సు అశోక్‌కు చెందిన బుల్లెట్ బైక్‌ను సూర్యాపేటలోని తాళ్లగడ్డకు చెందిన అబ్బగాని శ్రీమాన్ అపహరించాడు. దర్యాప్తు అనంతరం నిందితుడిని పట్టుకొని, బైక్ రికవరీ చేసి బాధితుడు ఓర్సు అశోక్‌కు అప్పగించినట్లు తెలిపారు. అనంతరం శ్రీమాన్‌ను కోర్టు ఎదుట హాజరు పరిచి రిమాండ్ చేసినట్లు చెప్పారు.

నకిలీ విలేకరుల అరెస్ట్

- సీఐని వేధించి అక్రమ వసూళ్లకు పాల్పడిన నిందితులు
- ఉన్నతాధికారులను ఆశ్రయించిన సీఐ
- దర్యాప్తు చేపట్టి ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు
- పరారీలో మరో నకిలీ విలేకరి


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర రాజు

మిర్యాలగూడ అర్బన్: కొందరు ప్రభుత్వ అధికారులను బెదిరించి డబ్బు వసూళ్లకు పాల్పడుతున్న నకిలీ విలేకరులను పోలీసులు అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలను డీఎస్పీ రాజశేఖర రాజు ఆదివారం మిర్యాలగూడలోని తన కార్యాలయంలో వెల్లడించారు. గత నెల రోజులుగా ఓ డిజిటల్ పేపర్‌లో వీరగాథ అనే శీర్షికన ఆ పేపర్ బ్యూరో ఎడిటర్ ఆనంద్‌కుమార్, మర్రిగూడ మండలం మట్టిపర్తి గ్రామానికి చెందిన స్టాఫర్ తుప్పరి రఘు, మాడుగులపల్లి మండలం పాములపాడు గ్రామానికి చెందిన పేరబోయిన ఆంజనేయులు ఎలాంటి ఆధారాలు లేకుండా వార్తలు రాసి డిజిటల్ పేపర్ ద్వారా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. వారి అసత్య వార్తలతో తీవ్ర మనోవేదనకు గురైన సీఐ సదరు వ్యక్తులను సంప్రదించగా రూ.5 లక్షలు ఇస్తే తమరిపై వార్తలు రాయడం మానేస్తామని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని సీఐ తన స్నేహితుడికి చెప్పాడు. ఆయన సలహా మేరకు విలేకరి అంజిని గత నెల 24న తన ఇంటికి రమ్మని చెప్పి వారితో మాట్లాడి రూ.1.10 లక్షలు ఇచ్చేందుకు అంగీకరించి ఆ డబ్బులను అందజేశాడు. దీనికి సంబంధించిన లావాదేవీల ఆధారాలతో పాటు ఆంజనేయులకు డబ్బులు వచ్చే వీడియోను పోలీసులు సేకరించారు. అయితే మిగిలిన రూ.4 లక్షలు కూడా ఇవ్వాలని గత కొద్ది రోజులుగా సదరు సీఐని బెదిరింపులకు పాల్పడుతుండడంతో చివరకు సీఐ మిర్యాలగూడ టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సోషల్ మీడియాలో వైరల్ కావడంతో..

వీరగాథ పేరుతో రాసిన వార్తలకు విలేకరులు ఎలాంటి ఆధారాలు చూపలేదు. ఈ విషయాలు బయటకు పొక్కడంతో విలేకరుల బాగోతం సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో సదరు డిజిటల్ పేపర్ విలేకరుల బాధితులు ఒక్కరొక్కరుగా బయటకు వచ్చి ఆయా పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేశారు. నాగార్జున సాగర్ అటవీశాఖ అధికారిగా పని చేస్తున్న వ్యక్తి గతంలో తనను బ్లాక్ మెయిల్ చేశారని రూ.50 వేలు రూపాయలు ఫోన్‌పే ద్వార వసూలు చేశారని నాగార్జునసాగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అదేవిధంగా సూర్యాపేటలో ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఓ అధికారిని బెదిరించి అప్పట్లో రూ.50 వేలు వసూలు చేశారని ఫిర్యాదు అందడంతో అన్ని ఆధారాలు సేకరించిన పోలీసులు ఆదివారం తుప్పరి రఘు, పేరబోయిన ఆంజనేయులును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బ్యూరో ఎడిటర్ ఆనంద్‌కుమార్ పరారీలో ఉన్నాడని, పట్టుకునేందుకు టీంలు ఏర్పాటు చేశామని త్వరలోనే అతడినికూడా అరెస్టు చేస్తామని తెలిపారు. పట్టుబడ్డ నిందితుల నుంచి మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, వారు వాడిన కారును కూడా సీజ్ చేస్తామని చెప్పారు.

ఎన్నికల కార్యాచరణను ప్రారంభించాలి


మాట్లాడుతున్న గంగిడి మనోహర్‌రెడ్డి

చౌటుప్పల్: పార్టీ శ్రేణులు రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యాచరణను ప్రారంభించాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గంగిడి మనోహర్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ, మండల బూత్ అధ్యక్షుల సమావేశం ఆదివారం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం బీజేపీకి మాత్రమే ప్రజల ఆదరాభిమానాలు ఉన్నాయన్నారు. ప్రజలతో నిత్యం కలిసే ఉండాలని, వారి సమస్యలను పరిష్కరించేందుకు నాయకులు పనిచేయాలన్నారు. ఆచరణకు సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చి మాటలతో కాలం గడుపుతున్న కాంగ్రెస్‌ను ఎండగట్టాలన్నారు. సమావేశంలో మున్సిపల్, మండల అధ్యక్షులు కడారి కల్పన, కై రకొండ అశోక్, అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, నాయకులు బందారపు లింగస్వామి, గుజ్జుల సురేందర్‌రెడ్డి, పోలోజు శ్రీధర్‌బాబు, గడ్డం నర్సింహ, పాలకూర్ల జంగయ్య, ముత్యాల భూపాల్‌రెడ్డి, మునగాల తిరుపతిరెడ్డి, దాసోజు భిక్షమాచారి, రిక్కల సుధాకర్‌రెడ్డి, చినుకని మల్లేష్, శాగ చంద్రశేఖర్‌రెడ్డి, మునగాల మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణకు అన్యాయం చేసిన మోదీ


రాష్ట్రానికి గాడిద గుడ్డు ఇచ్చిందని భువనగిరిలో ఫ్లెక్సీని చూపుతున్న ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు

- నిధుల కోసం ఢిల్లీ వెళ్లినా పట్టించుకోని కేంద్రం
- బీజేపీ ఎంపీలు ఎన్ని నిధులిస్తారో చెప్పాలి
- విలేకరుల సమావేశంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు కేటాయించడంలో మోదీ ప్రభుత్వం వివక్ష చూపిందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం భువనగిరిలో స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ఆయన వివరించారు. కేంద్రం విభజన హామీలు కూడా అమలు చేయడం లేదన్నారు. ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఉన్నా రాష్ట్రానికి నిధుల్లో మొండి చేయిచూపారన్నారు. కేంద్రానికి ఢిల్లీ,బిహార్ ఎన్నికలు కనిపిస్తునాయి తప్ప, మిగతా రాష్ట్రాలు, తెలంగాణ రాష్ట్రం కనిపించడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పలుమార్లు ఢిల్లీ వెళ్లి ప్రధాని, కేంద్ర మంత్రులను కలిసి నిధులు రూ.లక్షా 63 కోట్లు తెలంగాణ అభివృద్ధి కోసం అడిగినా కేటాయించలేదన్నారు. అత్యంత ప్రాముఖ్యత కలిగిన మూసీ ప్రక్షాళన కోసం అడిగిన ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం శోచనీయమన్నారు. ఎనిమిది మంది ఎంపీలను గెలిపించిన రాష్ట్రంపై మోదీకి ప్రేమ లేదన్నారు. బ్రహ్మాండమైన బడ్జెట్ అంటున్న కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు రూ. 50 కోట్ల లక్షల నిధుల్లో తెలంగాణకు ఎన్ని నిధులు తీసుకొస్తారో తెలియజేయాలని డిమాండ్ చేశారు. రేపటి నుంచి పార్లమెంట్‌లో జరిగే చర్చలో బీజేపీ ఎంపీలు తెలంగాణకు రావాల్సిన నిధులను ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలకు కేంద్రం నుంచి ఎలాంటి గ్రాంట్స్ మంజూరు చేయలేదని ఆరోపించారు. రాష్ట్రం నుంచి 5 శాతం జీడీపీ వచ్చినా కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రాలేదని తెలిపారు.

50 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై..

- ఆత్మీయ సమ్మేళనం నిర్వహించిన 1974–75 బ్యాచ్ పూర్వ విద్యార్థులు


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

గరిడేపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో 1974– 75 బ్యాచ్‌కు చెందిన ఏడో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానికంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 50ఏళ్ల తర్వాత చిన్ననాటి మిత్రులందరినీ కలుసుకుని ఆప్యాయంగా పలకరించుకుని, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేసిన తోటి స్నేహితులైన బొంత నాగమ్మ, బండ ప్రమీలను అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాలిశెట్టి అంజయ్య, ముచ్చర్ల గంగాధర్, ముచ్చర్ల చిన్న నరసింహారావు, వేనేపల్లి నరసింహారావు, బండ సత్యనారాయణరెడ్డి, లక్ష్మి, చంద్రకళ, చందా యాదగిరి, జాన్సన్, కుక్కునూరు వెంకటేశ్వర్లు, కీసరి రామరావు, బండ వెంకటమ్మ, భారతమ్మ, ఎడవెల్లి అమృతారెడ్డితో పాటు సన్మాన గ్రహీతలైన ఉపాధ్యాయులు పెరుమాళ్ల రామ్మూర్తి, అలుగుబెల్లి లక్ష్మారెడ్డి, రాగిరెడ్డి అమృతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పెద్దగట్టు దిష్టిపూజ


దురాజ్‌పల్లిలోని పెద్దగట్టులో లింగమంతుల స్వామి ఆలయం వద్ద భక్తుల కోలాహలం


దిష్టిపూజ మహోత్సవానికి వస్తున్న భక్తులు


కేసారంలో కోలాటం వేస్తున్న మహిళలు

ది అవార్డు 1996 చిత్రం ట్రైలర్ విడుదల

- నిర్మాతగా చౌటుప్పల్‌కు చెందిన చిరందాసు ధనుంజయ్య
- దర్శకుడు పోచంపల్లికి చెందిన బడుగు విజయ్‌కుమార్ సారథ్యంలో చిత్రం రూపకల్పన


సురేష్ ప్రొడక్షన్స్ అధినేత దగ్గుబాటి సురేష్‌బాబుతో చిరందాసు ధనుంజయ్య, బడుగు విజయ్‌కుమార్

చౌటుప్పల్, భూదాన్‌పోచంపల్లి: చౌటుప్పల్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త చిరందాసు ధనుంజయ్య నిర్మాతగా, భూదాన్‌పోచంపల్లికి చెందిన యువకుడు బడుగు విజయ్‌కుమార్ దర్శకత్వంలో మెగామేజ్ ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై గ్రామీణ వాతావరణంలో చేనేత కళాకారుల ఇతివృత్తంపై ది అవార్డ్ 1996 చిత్రాన్ని నిర్మించారు. దీనికి సంబంధించిన ట్రైలర్‌ను ప్రముఖ నిర్మాత సురేష్‌బాబు హైదరాబాద్‌లోని రామానాయుడు సినీ స్టూడియోలో విడుదల చేశారు. దర్శక, నిర్మాత, హీరో శివరాంరెడ్డి, హీరోయిన్ చందన, ఇతర సాంకేతిక నిపుణులతో కలిసి ట్రైలర్‌లో సినిమాను వీక్షించారు. దగ్గుబాటి సురేష్‌బాబు మాట్లాడుతూ.. చేనేత కళాకారులు దళారుల చేతిలో ఎలా మోసపోతున్నారనే ఇతివృత్తంతో మంచి సోషల్ ఎలిమెంట్స్‌తో చిత్రాన్ని నిర్మించిన దర్శక, నిర్మాతలను అభినందించారు. చిత్ర నిర్మాత, దర్శకుడు మాట్లాడుతూ ఉగాదికి చిత్రాన్ని విడుదల చేస్తామని తెలిపారు.

రోడ్డుప్రమాదంలో ఆరుగురికి గాయాలు

సూర్యాపేటటౌన్ : కంటైనర్ లారీని తుఫాన్ వాహనం వెనుక నుంచి ఢీకొట్టడంతో ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కంటైనర్ లారీని మఠంపల్లి నుంచి హైదరాబాద్ వైపు పది మంది ప్రయాణికులతో వెళ్తున్న తుఫాన్ వాహనం కొత్తబస్టాండ్ ఎదురుగా గల ఫ్లెక్లైవర్ వద్ద వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికులకు గాయాలు కాగా ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.